ప్రజాశక్తి

బుధవారం 25 డిసెంబర్ 2024

5

అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

మహాసభలో ప్రసంగిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాపోరాటమే నినాదం..!

పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటలే సిపిఎం నినాదం కావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా అనంతపురం కేంద్రంగా జరుగుతున్న సిపిఎం జిల్లా 14వ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. సోమ, మంగళవారం రెండు రోజులపాటు అనంతపురం నగరంలో మహాసభలు జరిగాయి. మొదటి రోజు బహిరంగ సభ జరగ్గా, రెండో రోజు మంగళవారం నాడు ఎస్ఎన్ ఫంక్షన్ హాలు ముస్కిన్ నగర్‌లో ప్రతినిధుల సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పరిశీలకులుగా పాల్గొన్నారు. రెండు రోజులుగా వివిధ అంశాలపై జరిగిన చర్చలను వారు నిశితంగా పరిశీలించారు. పార్టీ గడిచిన మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, విజయాలపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.

- మహాసభలో సిపిఎం నాయకులు
- ముగిసిన 14వ జిల్లా మహాసభ
- జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చ
- భవిష్యత్తు కర్తవ్యాలపై దిశానిర్దేశం
- చైతన్యం, ఉద్యమ స్ఫూర్తితో సాగిన మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెండు రోజులు పాటు అనంతపురంలో జరిగిన సిపిఎం మహాభలు ఉత్సాహంగా, చైతన్య భరితంగా సాగాయి. భవిష్యత్తు కర్తవ్యాలపై నాయకులు చేసిన ప్రసంగాలు పార్టీ శ్రేణులను చైతన్యం చేశాయి. మహాసభలో అనేక అంశాలపై తీర్మానాలు చేపట్టారు. రైతాంగ సమస్యలు, మహిళా, విద్యార్థి, కార్మిక సమస్యలు, సాగునీటి సమస్యలపైనా ప్రధాన దృష్టి సారించాలని ఈ మహాసభలో చర్చించారు. చర్చల అనంతరం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు సిపిఎం నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి దిశానిర్దేశం చేశారు. దేశంలో మతత్వ ప్రమాదం మరింతగా ముంచుకొస్తోందని చెప్పారు. ఇది మన రాష్ట్రంలోనూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తిప్పికొట్టేందుకు అవసరమైన ఎత్తుగడలను వేయాలని సూచించారు. బిజెపి తెస్తున్న మత విభజన రాజకీయాలను తిప్పికొట్టి ఐక్యతను తీసుకొచ్చే కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలోనూ జరగాలని చెప్పారు. స్థానిక సమస్యలపైనా పోరాటాలు సాగిస్తూనే పార్టీ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. అధికార టిడిపి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. విద్యుత్ భారాలను ప్రజలపై అధికంగా వేస్తోందని తెలిపారు. వీటిపైనా దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సి ఉందన్నారు.

ప్రతినిధుల సభలో ప్రసంగిస్తున్న వై.వెంకటేశ్వరరావు

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో జిల్లాలో సిపిఎం అనేక కార్యక్రమాలు రూపొందించింది. అయితే వీటిని మరింతగా చేపట్టడంతో ప్రజా సంఘాలను ఏర్పాటు చేసుకుని మరింత ముందు కెళ్లాల్సిన అవసరముందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్య దర్శి వి.రాంభూ పాల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల్లో సిపిఎంకు ప్రజల్లో ప్రత్యేకత ఉందన్నారు. కార్మికులు, రైతులు, ప్రజల పక్షాన పోరాటాలు నిరంతరం కొనసాగించడమే ప్రధాన కర్తవ్యంగా పని చేస్తామన్నారు. రాబోవు మూడేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధి, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. అనేక పోరాటాలు చేశామంటే ఎందరో సహాయ సహకారాలతో సాధ్యమైందన్నారు. సిపిఎం నాయకులు కార్యకర్తల సమిష్టి పోరాటం పూర్వ నాయకుల వారసత్వాన్ని కొనసాగింపే అన్నారు. అనంతరం 26 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. తొమ్మిది మందితో కార్యదర్శివర్గం ఏర్పాటైంది.

ప్రతినిధులు సభలో పాల్గొన్న ప్రతినిధులు

సిపిఎం సీనియర్ నాయకులకు సన్మానం

అనిమిరెడ్డిని సత్కరిస్తున్న వి.శ్రీనివాసరావు

సిపిఎం సీనియర్ నాయకులకు మహాసభలో సన్మానం చేశారు. పామిడికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డికి వి.శ్రీనివాసరావు శాలువ కప్పి సన్మానం చేశారు. అదే విధంగా గార్లదిన్నెకు చెందిన నాగమ్మను వై.వెంకటేశ్వరరావు శాలువ కప్పి సన్మానించారు. వారు చేసిన పోరాటాలను నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలోకి వెళ్లి సమస్యలను పరిశీలించి వాటిపైనా పోరాటాలు చేస్తేనే పార్టీ బలపడుతుందన్నారు. ఈ మేరకు అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకురాలు నాగమ్మ మాట్లాడుతూ భూ పోరాటాలు నిర్వహించి ఎందరో భూమి లేని పేదలకు సాగుభూములు ఇప్పించామన్నారు. వాటిని కొనసాగిస్తూ ఉద్యమాలను నిర్మించాలని ఆమె సూచించారు.

నాగమ్మను సత్కరిస్తున్న వై.వెంకటేశ్వరరావు

వినియోగదారుల రక్షణ చట్టంపై

అవగాహన కల్పించాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, వారికి అవగాహన కల్పించడం, హక్కులను గుర్తు చేయడం కోసమే జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం ద్వారా మోసపోయిన వినియోగదారులకు సాధ్యమైనంత సత్వర న్యాయాన్ని అందించడానికి వీలవుతుందన్నారు. ఈ చట్టం వస్తువులు సేవలు, తయారీదారులు, పంపిణీదారులు, అమ్మకందారులు, వారు తయారు చేసిన, అమ్మిన వస్తువుల నాణ్యత, రక్షణకు సంబంధించి బాధ్యులను చేస్తుందన్నారు. వినియోగదారులు ఎక్కడ వస్తువులు కొన్నప్పటికీ తమ నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి వినియోగదారుడు వినియోగదారుల రక్షణ చట్టం పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని, ఒకవేళ వస్తు సేవలు కొనుగోలు విషయంలో మోసపోతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలన్నారు. వినియోగదారునికి సత్వర న్యాయం సులభమైన విధానంలో అందించే విధంగా వినియోగదారు కమిషన్లను బలోపేతం చేసినట్లు వివరించారు. బాధిత వినియోగదారులు మరింత ఉత్సాహంగా ఈ న్యాయవ్యవస్థను ఆశ్రయించి లబ్ధి పొందగలరని ఆశిస్తున్నామన్నారు. కాగా జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో తెలుగులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి కింద రూ.3 వేలను జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గీతారెడ్డికి, రెండవ బహుమతి కింద రూ.2 వేలను బెళుగుప్ప జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న ఈశ్వరికి, మూడో బహుమతి కింద రూ.1500 వెంకటంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న అభిలాష్‌కు అందజేశారు. అలాగే ఇంగ్లీషులో జరిగిన పోటీలకు సంబంధించి మొదటి బహుమతి కింద రూ.3వేలను పెద్దపొలమడ జడ్పిహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న ఎ.లావణ్యకు అందించగా, లావణ్య రాష్ట్రస్థాయిలో కూడా మూడవ బహుమతి సాధించింది. పెద్దవడుగూరు కెజిబివిలో 9వ తరగతి చదువుతున్న సలోమి రెండవ బహుమతిని, పుట్లూరు ఏపీఎంఎస్ లో 9వ తరగతి చదువుతున్న తనూజాకి మూడో బహుమతి అందించారు. ఉర్దూలో మొదటి బహుమతిని అనంతపురం జిహెచ్ఎస్ బాయ్స్‌లో 10వ తరగతి చదువుతున్న అషు జాబిన్‌కి, కనేకల్ జడ్పీహెచ్ఎస్యు కి చెందిన పదవ తరగతి విద్యార్థి తస్లీమ్ కి రెండవ బహుమతి, అనంతపురం జిహెచ్ఎస్ బాయ్స్ లో 10వ తరగతి చదువుతున్న రూబీనాకి మూడో బహుమతి అందజేశారు. వక్తృత్వ పోటీల్లో భాగంగా తెలుగులో నిర్వహించిన పోటీలకు మొదటి బహుమతిని పెద్ద పొలమడ జడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.జగదీష్‌కి, రెండవ బహుమతి హనకనహళ్ జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి విద్యార్థి పి.గణేష్‌రెడ్డికి, మూడో బహుమతి గార్లదిన్నె ఎపిఎంఎస్‌లో 9వ తరగతి విద్యార్థి ఐశ్వర్యకి అందించారు. ఇంగ్లీషులో జరిగిన పోటీలలో మొదటి బహుమతి గుంతకల్లు రైల్వే స్కూల్లో పదవ తరగతి విద్యార్థి దేవానందినికి, రెండవ బహుమతి గార్లదిన్నె కెజిబివిలో పదవ తరగతి విద్యార్థి ఎం.కావ్యకి, మూడో బహుమతి కనేకల్ ఎపిఎంఎస్‌లో పదవ తరగతి విద్యార్థి యు.వీణాకి అందించారు. ఉర్దూలో జరిగిన పోటీల్లో మొదటి బహుమతిని తాడిపత్రి కెజిబివికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఉల్మునిస్సాకి, రెండవ బహుమతి అనంతపురం జిహెచ్ఎస్ బాయ్స్‌లో 10వ తరగతి విద్యార్థి తహసీన్‌కి, మూడో బహుమతి జెడ్ కనేకల్ జెడ్పిహెచ్ఎస్‌లో పదవ తరగతి విద్యార్థి ముజాకిరాకి అందజేశారు. అలాగే జూనియర్ కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూలో నిర్వహించి 18 మంది విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా కన్జ్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ శ్రీలత, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రీజినల్ సభ్యులు నబిరసూల్, డిఇఒ ప్రసాద్‌బాబు, డివిఇఒ వెంకటరమణనాయక్, సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ వెంకటరామిరెడ్డి, ఎపిఎస్ ఆర్టీసీ అధికారి శ్రీలక్ష్మి, డిసిఐసి ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి, కన్జ్యూమర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవుపై ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శి

నిధుల దుర్వినియోగంపై అనుమానాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ డిసెంబర్ 1వతేదీన పింఛన్లు పంపిణీ తర్వాత దీర్ఘకాలిక సెలవు పెట్టారు. గత నవంబర్‌లో ఆత్మకూరు మేజర్ పంచాయతీలోని ఎస్ఎఫ్‌సికి సంబంధించిన దాదాపు రూ.90వేలతోపాటు పలు అభివృద్ధి పనులకు లక్షల్లోనే నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సంబంధిత మండల పరిషత్ దిగువ స్థాయి అధికారి ఆరా తీసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతోనే కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంపిడిఒ, ఇఒఆర్‌డిలను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ అనారోగరీత్యా సెలవు పెట్టినట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా పంచాయతీలో నిధులు స్వాహా చేయడంతో పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయగా పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు స్థానికులు, కార్యాలయ సిబ్బంది చర్చించుకున్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

కెవికె శాస్త్రవేత్త ఎస్ఎన్.మల్లీశ్వరి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పుట్టగొడుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్ఎన్.మల్లీశ్వరి సూచించారు. పుట్టగొడుగుల పెంపకంపై వారంరోజులుగా రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆత్మా సౌజన్యంతో పుట్టుగొడుగుల పెంపంకంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో చాలామంది ఆసక్తిగా తరలివచ్చి శిక్షణ పొందడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారానికి ప్రత్యామ్నాయంగా పుట్టగొడుగుల ఆహారం తీసుకోవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆత్మ పీడీ మద్దిలేటి మాట్లాడుతూ గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ స్వయం ఉపాధి పొందాలని సూచించారు. వారం రోజుల శిక్షణ పొందిన వారందరూ గ్రూపుగా, వారి అనుకూలాన్ని బట్టి యూనిట్లను ఏర్పరుచుకుని ఆదాయం పొందాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకున్న వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

26 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి-నార్పల :

మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 26 నుంచి 28వతేదీ వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ గంగావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

'సుందర రాయదుర్గం'కు కృషి

ప్రజాశక్తి-రాయదుర్గం

పాలకమండలి సహకరిస్తే 'సుందర రాయదుర్గం' రూపకల్పనకు కృషి చేద్దామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన మంగళవారం రాయదుర్గం పురపాలక మండలి సాధారణ, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పురపాలక మండలి, అధికారులు, పట్టణ ప్రజలు సహకరిస్తే సుందర రాయదుర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలో మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు స్వీకరించి, పట్టణ ప్రణాళిక అధికారుల ద్వారా అధ్యయనం చేసి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా బళ్లారి రోడ్డు విస్తరణ, హోల్‌సెల్ కూరగాయల మార్కెట్, బస్టాండ్ తరలింపు, జాతీయ రహదారిని బళ్లారి రోడ్డుతో కలుపుతూ రింగ్ రోడ్డు ఏర్పాటు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వాణిజ్య దుకాణాల సముదాయ భవనం ఏర్పాటు, ట్రాఫిక్ సమస్య క్రమబద్ధీకరణ వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. వీటితోపాటు పట్టణంలోని అనంతపురం-కనేకల్లు రోడ్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, జాతీయ రహదారి వంతెన నిర్మాణం చేపడతామన్నారు. ఇకపోతే గతంలో ఇవ్వని కొళాయి కనెక్షన్లకు నీటి పన్ను చెల్లించాలని కోరడం సమంజసం కాదన్నారు. వాటిని రద్దు చేయాలని కోరుతూ కౌన్సిల్ తీర్మానం చేయాలని సూచించారు. ఇకపోతే పాలక మండలి సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈనెలాఖరులోగా పట్టణంలో కనీసం 250 వీధి దీపాలు మరమ్మతు చేసి వెలిగిస్తామని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం రాయదుర్గం పురపాలక సంఘం 2024-25 సంవత్సరానికి సవరించిన అంచనా బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌కు పురపాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, సభ్యులు గోవిందరాజులు, అజయ్ కుమార్, పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రంలో మాజీ సిఎం జగన్ ఫ్లెక్సీలను చింపివేయడంపై మండల వైసిపి నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని వైసిపి నాయకులు ఇటీవల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారన్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి టిడిపి సానుభూతిపరులు వైసిపి ఫ్లెక్సీలను చించివేశారన్నారు. వెంటనే వైసిపి ఫ్లెక్సీలను చించివేసిన టిడిపి సానుభూతిపరులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఐకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

గంజాయి కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి - తాడిపత్రి

జిల్లాలో గంజాయి కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం తాడిపత్రి సబ్‌డివిజన్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి మూలాలను కనిపెట్టేందుకు సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీసు జాగిలాల సహాయంతో రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, పార్సిల్ సర్వీసు, ట్రాన్స్ పోర్టు కార్యాలయాలు, కార్గో సర్వీసులు, గొడౌన్లు, లాడ్జిలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణాకు అవకాశం ఉన్న మార్గాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వాహన తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభావాల గురించి క్షేత్ర స్థాయిలో జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది వారి పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులకు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో గంజాయి సేవిస్తున్న కళాశాలల విద్యార్థులను గుర్తించి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, ఆయా కళాశాలల యాజమాన్యాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మళ్లీ అదే తప్పు చేస్తే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతపురం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా నిర్మాణష్యమైన పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గంజాయి వినియోగం, రవాణా నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు.

తాడిపత్రిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

తాడిపత్రి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పి పి జగదీష్ స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. అల్లర్లు, గొడవలకు తావుండరాదన్నారు. ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంచాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోలీసు క్వార్టర్స్ ను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్, సబ్ డివిజన్ సిఐలు శివగంగాధర్ రెడ్డి, రామసుబ్బయ్య, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఫోటో. తాడిపత్రి సబ్ డివిజన్ పరిధి జిల్లా ఎస్పీకి వివరిస్తున్న డి.ఎస్.పి రామకష్ణుడు

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రామాల్లో నిరంతర నిఘా కొనసాగించాలి : ఎస్పీ

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్‌లోని పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మండలంలో కేసుల వివరాలను స్థానిక పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రైం రేటును తగ్గించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గంజాయిపై ప్రత్యేక నిఘా వేయాలని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మద్యం, నాటుసారా రవాణాను కట్టడి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామకృష్ణుడు, సిఐ రామసుబ్బయ్య, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించి సమస్యాత్మక గ్రామాలపై ఆరాతీశారు. తర్వాత రౌడీ షీటర్, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యక్రమాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన కూడల్లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలకు సంబంధించి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కందులను కొనుగోలు చేయాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఈ ఏడాది అత్యధికంగా కంది పంట సాగు చేశారన్నారు. దీంతో అప్పుడే రైతుల వద్దకు దళారులు చేరుకుని మోసం చేస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో రైతుల నుంచి కంది పంటను సేకరించాలన్నారు. కాగా నేడు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ క్రీస్తు ఆశీస్సులు, దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రమణయాదవ్, విడపనకల్ మాజీ ఎంపిపిలు రమణారెడ్డి, రామచంద్ర, తిప్పయ్య, సర్పంచులు జయేంద్రరెడ్డి, శివలింగ, తిరుపాల్‌యాదవ్, నాయకులు శంకర్‌రెడ్డి, తిప్పారెడ్డి, ఆమిద్యాల చెన్నబసన్నగౌడ్, బోయ రాంబాబు, దుద్దేకుంట సూరి, మహాలింగ, లాలెప్ప, గురు, మునయ్య, ముద్దయ్య, కేశన్న, ముష్టూరు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే'లో దగ్గుపాటి

వికలాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఎన్నోఏళ్లుగా నగరంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 22వ డివిజన్ మరువకొమ్మ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ, తాగునీరు, ఇళ్ల పట్టాల వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నగరంలోని శివారు కాలనీలు అధ్వాన్నంగా మారాయన్నారు. ముఖ్యంగా కాలనీలో పార్కు, పాఠశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత 30ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలు త్వరలోనే ఇచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లిం మైనారిటీ కమిటీ ఎన్నిక

మైనారిటీ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి : నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా వరిగడ్డి షాషావలి, ప్రధాన కార్యదర్శిగా జక్కలచెరువు మహబూబ్‌బాషాను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్.బాజీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కమిటీ వరిగడ్డి షాషావలి, మహబూబ్‌బాషా, మండల కమిటీ అధ్యక్షుడు పి.చాంద్‌బాషా, కార్యదర్శి కుళ్లాయిను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు అబ్దుల్‌సుభాన్, ఖాజాహుస్సేన్, డి.షఫీ, వరిగడ్డి షేక్షావలి, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళాలు

అనంతపురం రూరల్ : టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా మరో ముగ్గురు టిడిపి నాయకులు ఒక్కొక్కరి చొప్పున రూ.50వేల చొప్పున విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి, 27వ డివిజన్ ఇన్‌ఛార్జి సుధాకర్‌యాదవ్, 45వ డివిజన్ టిడిపి నాయకులు పొత్తూరు దినేష్‌చౌదరి, పొత్తురు వెంకటరమణ, సింగంవరం రవీంద్రనాయుడు ఆయా విరాళాల మొత్తాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందజేశారు. ఆయా నాయకులు ఎమ్మెల్యే అభినందించారు.

మాజీ కార్పొరేటర్ మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

అనంతపురం రూరల్ : అనారోగ్యంతో మృతిచెందిన మాజీ కార్పొరేటర్ పోతులయ్య మృతికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం వేర్వేరుగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. తర్వాత కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్ ఓబిరెడ్డి, తదితరులు ఉన్నారు.

జాతీయ సెమినార్‌లో బుక్కరాయసముద్రం ఎంపిపి

బుక్కరాయసముద్రం : కేంద్ర ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం ఆధ్వర్యంలో రూరల్, పంచాయతీరాజ్ సంస్థ సహకారంతో మైసూర్‌లో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి బుక్కరాయసముద్రం ఎంపిపి దాసరి సునతీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి సునీత మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజలతో ఎన్నుకున్న మహిళల భర్తల పాత్ర, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాయదుర్గం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విజయలక్ష్మి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా టి.విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలోని కెఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలుగా పని చేస్తూ పదోన్నతిపై రాయదుర్గం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో సమస్యలను పరిష్కరించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ శుక్లా ఆదేశాల మేరకు విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎ, బి విభాగాలుగా విభజించి అవసరమైన తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

హెచ్చెల్సీ ఛైర్మన్‌కు సన్మానం

హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా ఎన్నికైన మారెడ్డి జోగిరెడ్డిని సన్మానిస్తున్న యల్లనూరు నాయకులు

ప్రజాశక్తి-యల్లనూరు

తుంగభద్ర డ్యాం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా ఎన్నికైన మారెడ్డి జోగిరెడ్డిని స్వగ్రామం కసునూరులో యల్లనూరు మండలానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బొకేలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాతపల్లి సర్పంచి వెన్నపూస నవీన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎరువుల వ్యాపారి చంద్రశేఖర్‌రెడ్డి, భాగవత భక్త సమాజం మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచి విజయ భాస్కర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గంగిరెడ్డి, తదితరులు పాల్గొ న్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి

పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో స్వర్ణోత్సవ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5, 6, 7, 8వతేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సభల విజయవంతానికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, కోటేశ్వరప్ప ఆధ్వర్యంలో గుంతకల్లులో ఈనెల 26న స్వర్ణోత్సవ ప్రచార జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంతకల్లులో జాతా ప్రారంభమై ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా రాప్తాడు చేరుకుంటుందన్నారు. ఈ ప్రచార జాతాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యులు రాజశేఖర్, విడపనకల్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ఉరవకొండ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారులు బండయ్య, వేణుగోపాల్, గౌరవాధ్యక్షులు శ్రీనివాసగుప్తా, జిల్లా కౌన్సిలర్లు నాగరాజు, రఘు, శ్రీధర్, కార్యదర్శులు మోహన్, ధనంజయవర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

పోస్టర్లు విడుదల చేసిన వైసిపి నాయకులు

శింగనమలలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు వైసిపి మండల నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఈనెల 27న చేపట్టనున్న పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తగ్గించకపోగా కరెంటు ఛార్జీలు పెంచడం బాధాకరమన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ నియోజకవర్గ కేంద్రంలో చేపట్టనున్న పోరుబాట కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చాగంటి గురుమూర్తిరెడ్డి, బొమ్మన గోపాల్‌రెడ్డి, సర్పంచులు వెంకటరాముడు, మురళి, నాగన్న, శంకర్‌రెడ్డి, నాగమునెమ్మ, మదిరేపల్లి రవీంద్రారెడ్డి, ఎంపిటిసిలు మొరార్జి దేశాయ్, రమేష్, మల్లికార్జునరెడ్డి, నాయకులు ఓబుళపతి, వీరాంజనేయులు, రమణారెడ్డి, నాగులగుడ్డం వెంకటరమణ, రామకృష్ణారెడ్డి, అంజి, ఎస్‌పి నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కప్పల నారాయణస్వామి, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసంలో ఈనెల 27వతేదీన నిర్వహించనున్న పోరుబాటకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీల పేరుతో సామాన్యుల నడ్డి విరచడం బాధాకరమన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, యువజన నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శ్రీచైతన్య పాఠశాలలో కేక్ కోస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వివేకానంద పాఠశాలలో పండుగ చేసుకుంటున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలను పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతా క్లాస్ వేషధారణతో ఉన్న విద్యార్థులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే అనంతపురం సుభాష్ రోడ్డులోఉన్న అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కోశారు. అనంతరం పాస్టర్ కె.సురేష్ క్రీస్తు సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్‌ఛైర్మన్ గోల్డ్ బాషా, డైరెక్టర్లు సుంకర రమేష్, ఎం.రామాంజనేయులు, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, రమణయ్య, బ్యాంకు సిఇఒ ఎం.విజయభాస్కర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు : పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్లు ఓంకారప్ప, గురు విద్యార్థులకు క్రీస్తు జననం, క్రిస్టమస్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చిలు

నార్పల : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా చర్చిలను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పుట్లూరు : క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పుట్లూరుతోపాటు గూడూరు, కడవకల్లు, తదితర గ్రామాల్లో చర్చిలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రైతుల సమస్యల పరిష్కారానికే సదస్సులు

నార్పల సదస్సులో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-నార్పల

గ్రామాల్లోనే రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదసులు నిర్వహిస్తోందని తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ గంగావతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 50కిపైగా వినతులు వచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పలు రెవెన్యూ సమస్యలను సదస్సుల్లో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగరత్నమ్మ, సర్పంచి సుప్రియ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌మూర్తి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్యోతిరాణి, గూగూడు ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకేతపురం శోభ, మండల సాగునీటి సంఘం అధ్యక్షులు గవ్వల పరంధామ, పంచాయతీ కార్యదర్శి శ్యామల, విఆర్ఒలు శివరామ్, నిరంజన్‌రావు, రామాంజనేయులు, విఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు .

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 28 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. ఇందులో పొలాలు సరిహద్దులు చూపించాలని, ఆన్‌లైన్‌లో రిజిస్టర్ భూములు ఎక్కించాలని, సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయాలనే సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఒ సుజాత, సచివాలయ సర్వేయర్ హనుమంతు, టిడిపి నాయకులు సోమరాజు గౌడు, రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని కోట మారమ్మ గుడి ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి 14 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. వీటిలో రస్తా కోసం 2, హద్దులు చూపాలని 8, పట్టాదారు పాసుపుస్తకం కోసం 3, పట్టా కోసం ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి తర్వలోనే చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

తెగుళ్లను నివారించుకోవాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారిణి గౌసియా

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రస్తుతం మంచు కురుస్తున్న నేపథ్యంలో మామిడి, టమోటా పంటలకు వ్యాపించే తెగుళ్లను నివారించుకోవాలని హార్టికల్చర్ అధికారిణి గౌసియా సూచించారు. సోమవారం మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన మామిడి, టమోటా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టమోటా, మామిడి పూతలకు ప్రస్తుతం బూడిద, మచ్చ తెగుళ్ల వచ్చాయన్నారు. వీటిని నివారించుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చున్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పరిధిలో అనధికారికంగా వెలసిన ఎనిమిది అనధికారిక లేఅవుట్లపై మునిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. ఇందులో భాగంగా అనంతపురం రోడ్డు, గలగల రోడ్డు, గౌడ లేఔట్, అడిగుప్ప రోడ్డు, ముత్రాసు కాలనీల వద్ద అక్రమంగా వేసిన లే అవుట్లలోని రాళ్లను జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఔట్లలో ప్రజలు ఎవరూ ప్లాట్లను కొనుగోలు చేయరాదన్నారు. సంబంధిత లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు పురపాలక సంఘం అనుమతి ఇవ్వదన్నారు. అంతేగాకుండా అక్రమంగా లేఅవుట్ వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

అనధికార లేఅవుట్లలో రాళ్లను తొలగతిస్తున్న జెసిబి

క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

నేడు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పలువురు నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం మేయర్ మహమ్మద్ వసీం, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా క్రిస్టియన్ సంస్థలు సేవాతత్పరతతో ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. సమాజంలో చెడునుపక్కన పెట్టి మంచిని పెంపొందించాలని సూచించారు.

సజావుగా వేలంపాట

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలోని కాంప్లెక్స్ భవనాల అద్దె నిమిత్తం మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వరలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాట సజావుగా సాగతింది. ఈసందర్భంగా 12 భవనాలకు సంబంధించి వేలం నిర్వహించారు. ఇందులో వేలం దక్కించుకున్న వారికి జనవరి నెల నుంచి గదులను అప్పగించనున్నట్లు ఎంపిడిఒ నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, బిల్ కలెక్టర్ జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుపై దిశానిర్దేశం

ప్రజాశక్తి-పుట్లూరు

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపై హౌసింగ్ సిబ్బందికి ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో దిశానిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలం ఉంటే సర్వేయర్‌తోపాటు విఆర్ఒ వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. తర్వాత ఇంటి పట్టా మంజూరు చేయాలని సూచించారు. తర్వాత ఇళ్ల నిర్మాణాలకు ఎలా దరఖాస్తు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, విఆర్ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబిపిటిఎ.ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని పాకశాల హోటల్, లక్కీ-9 తాడిపత్రి బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్, జాతీయ రహదారి 44పై ఉన్న పలు హోటళు „, రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కొన్ని వాటిల్లో నమూనాలను తీసుకుని ల్యాబ్‌కు పంపారు. తర్వాత అపరిశుభ్రమైన వాతావరణం గమనించి నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ఎం.నాగభూషణం, సిఐ ఎస్.జమాల్‌బాషా, ఎఒ జె.వాసుప్రకాష్, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమా పాల్గొన్నారు.

27న ప్రజావేదిక

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఈనెల 27వ తేదీన శుక్రవారం ఉపాధి హామీ పనులపై బహిరంగ సమీక్ష (ప్రజావేదిక) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి 1 నుంచి 2024 మార్చి 1వతేదీ వరకూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులను గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందం క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. ఆయా నివేదికలపై 27న అధికారులు, ప్రజలు, ఉపాధి కూలీల సమక్షంలో బహిరంగ సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

బిటిపి ఆయకట్టు రైతుల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవానితిప్ప ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సాగునీటి సంఘం సమావేశం ఈనెల 28వ తేదీకి వాయిదా పడినట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు కాలవ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సాగునీటి సంఘం సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల వాయిదా పడినట్లు తెలిపారు. తదుపరి సమావేశం ఈనెల 28న బిటిపి కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచి కుమారుడి మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముప్పలకుంటకు చెందిన మాజీ సర్పంచు కుమారుడు రమేష్ అనారోగ్యంతో మృతిచెందడంతో టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మంగళవారం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామచంద్రప్ప, మాజీ వైస్ ఎంపిపి చిత్తప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవిందప్ప, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహ్మాద్‌రఫీ శతజయంతి

అనంతపురం : స్థానిక లలితకళా పరిషత్ లో సంగీతప్రియులు స్వర్గీయ మహమ్మద్ రఫీ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత రఫీ చిత్రపటానికి ఎల్కెపి కార్యదర్శి పద్మజ ,సాదియా క్యాటరింగ్ అధినేత డిస్కో బాబు, షబానా, ర్యాంబో స్టూడియో అస్లాంబాషా నివాళి అర్పించారు. అనంతరం పలువురు గాయకులు పాటలు పాడారు .కార్యక్రమంలో పలువురు సంగీతప్రియులు, కళాకారులు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ పోస్టర్ల విడుదల

రాయదుర్గం : అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం రాయదుర్గంలోని ఎన్‌జిఒ హోంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌నాయక్, కొట్రేష్, జిల్లా కోశాధికారి ఆంజనేయులు, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి మృతి

గుత్తి : మండలంలోని తురకపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు కిందపడి మరణించాడా.. ఆత్మహత్య చేసుకున్నాడా.. అనే విషయం పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. రైల్వే సిబ్బంది సమాచారంతో జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడు నలుపు రంగు టీ షర్టు, లోయర్, జర్కిన్, గీతల అంగీ ధరించగా, దేహంపై జెజ్యం, తెలుపు రంగు మొలతాడు ఉన్నాయన్నారు. ఆనవాళ్లను బట్టి చూస్తే మృతుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వాడై ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఆచూకీ తెలిసిన వారు సెల్..63050 73235కు ఫోన్ చేయాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వృద్ధురాలు ఆత్మహత్య

గుత్తి : పట్టణంలోని కుంటకట్ట సమీపంలో నివాసం ఉండే ఓ వృద్ధురాలు మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు సి.లక్ష్మీదేవి(75) తన మనవరాలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో దిగాలు పడిన ఆమె మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గుత్తి : రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన శ్రీరాములు(55) మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాములు తాపీ మేస్త్రి గా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఇందులో భాగంగానే ఈనెల 22న సాయంత్రం పని ముగిసిన అనంతరం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా జెండా వీధి సమీపంలో కర్నూలు రోడ్డులో వెనుకవైపు నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పరీక్షించిన వైద్యులు సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.